క్లుప్తంగా

హక్కుల సాధన సమితి ఉపాధ్యక్షురాలిగా నాగమణి



నియామక పత్రం అందుకుంటున్న నాగమణి

నర్సాపూర్: మండలంలోని కాగజ్‌మద్దూర్ గ్రామానికి చెందిన రాయిలాపురం నాగమణిని రాష్ట్ర మాలల హక్కుల సాధన సమితి మహిళ ఉపాధ్యక్షురాలిగా నియమించారు. మెదక్‌లో గురువారం జరిగిన సమావేశంలో రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు బొమ్మల మైసయ్య ఆమెకు నియామక పత్రం అందజేశారు. ఆమె మాట్లాడుతూ మహిళల సమస్యలపై తన వంతు పోరాటం చేస్తానని చెప్పారు.

జిల్లా ముదిరాజ్ మహాసభ ఉపాధ్యక్షుడిగా అంజయ్య



నియామక పత్రం అందజేస్తున్న నాయకులు

టేక్మాల్(మెదక్): జిల్లా ముదిరాజ్ మహాసభ ఉపాధ్యక్షుడుగా బొడ్మట్‌పల్లి గ్రామానికి చెందిన తనను ఎకగ్రీవంగా ఎన్నుకున్నట్లు భవాని అంజయ్య తెలిపారు. జిల్లా అధ్యక్షుడు మానే గాళ్ల రామకృష్ణయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుట్టి అక్షయ్ కుమార్ తదితరులు నియామక పత్రాన్ని శుక్రవారం అందజేశారు. హవేళిఘ ణాపూర్ మండల అధ్యక్షుడు పెంటయ్య, డాకి స్వామి, ఫిషరీష్ డైరెక్టర్‌లు పెంటయ్య, స్వామి, శ్రీను తదితరులు ఆయనకు అభినందనలు తెలిపారు.

వైద్యశిబిరం నిర్వహణ అభినందనీయం

ఎంపీపీ చింత స్వప్న



నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

టేక్మాల్(మెదక్): విశ్రాంత ఉద్యోగులు ఉచిత వైద్యశిబిరాలను ఏర్పాటుచేసి గ్రామీణ ప్రజలకు సేవలు అందించడం అభినందనీయమని ఎంపీపీ చింత స్వప్న అన్నారు. శుక్రవారం టేక్మాల్ గాంధీభవన్‌లో హైదరాబాద్ మెడివిజన్ కంటి ఆస్పత్రి నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విశ్రాంత ఉద్యోగుల సంఘం బాధ్యులు వైద్య సేవలు అందించడం సంతోషకరమన్నారు. పంచాయతీ ఈఓ కమలాబాయి, వైద్యులు మానస, ఉదయ్, ఆంజనేయులు, నాయకులు భాస్కర్, విశ్రాంత ఉద్యోగులు విఠల్, శంకర్‌రావు, నారాయణ, నర్సింహులు, మాధవచారి తదితరులు ఉన్నారు.

గ్రామాల్లో ఎన్‌ఎస్‌ఎస్ సేవలు



గ్రామంలో పర్యటిస్తున్న వాలంటీర్లు

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని గౌతోజిగూడెంలో సీఎంఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కండ్లకోయ ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ప్రత్యేక క్యాంప్ ఏర్పాటు చేశారు. సుమారు 60మంది విద్యార్థులు గ్రామంలోనే వారంరోజుల పాటు ఉండి పలు సేవ, అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. క్యాంప్‌లో భాగంగా మొదటిరోజు వాలంటీర్లు గ్రామంలోని పలు వీధుల్లో తిరుగుతూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. వారిని గ్రామస్తులు అభినందించారు.

కాంగ్రెస్‌లో చేరికలు



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే రోహిత్

మెదక్‌జోన్: పట్టణంలోని పలువార్డులకు చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు సమక్షంలో కాంగ్రెస్‌లోకి చేరారు. 4, 12, 29వార్డులకు చెందిన సుమారు 200మంది బీఆర్‌ఎస్ కార్యకర్తలను శుక్రవారం ఎమ్మెల్యే కండువాలు కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, మాజీ చైర్మన్ రాగి అశోక్, బొజ్జపవన్, యువనేత పరుశురామ్, ఆంజనేయులుగౌడ్ తదితరులున్నారు.

ముక్కు మూసుకోవాల్సిందే..

- రోడ్లపై పారుతున్న మురుగు నీరు
- దుర్వాసనతో స్థానికుల అవస్థలు
- పట్టించుకోని ప్రత్యేక అధికారులు

ప్రత్యేక అధికారుల పాలనలో గ్రామాలు అస్తవ్యస్తంగా మారాయి. వారు ఎప్పుడు దర్శనమిస్తారో తెలియదు. దీంతో కొన్ని గ్రామాల్లో వ్యవస్థలు పనిచేయడంలేదు. ముఖ్యంగా డ్రైనేజీల నిర్వహణ సవ్యంగా సాగడంలేదు. కొన్ని గ్రామాల్లో 15రోజులుగా మురుగు నీరు రోడ్లపైనే ప్రవహిస్తోంది. దుర్వాసనతో ప్రజలు అవస్థలు పడుతున్నారు.



బస్టాండ్ ప్రాంతంలో అస్తవ్యస్తంగా..



ప్రవహిస్తున్న మురుగునీరు

అల్లాదుర్గం(మెదక్): స్థానిక బస్టాండ్ ప్రాంతంలోని మురుగు కాలువలు పొంగి ప్రవహిస్తున్నాయి. డ్రైనేజీలు చెత్తచెదారంతో నిండిపోవడంతో మురుగు నీరు రోడ్లపై వరదలా పారుతోంది. ఆ దుర్గంధంతో దుకాణదారులు, ఆటో డ్రైవర్లు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. మండల కేంద్రాలకే పరిమితమైన ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శి తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 15 రోజులుగా ముక్కు మూసుకోవల్సిన పరిస్థితి నెలకొందని వాపోయారు. పంచాయతీ కార్యదర్శి ఎక్కడ ఉంటున్నారో, ఎప్పుడు కార్యాలయంలో ఉంటారో తెలియడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని, విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వైభవంగా పెద్దమ్మ పెద్దిరాజుల కల్యాణం



అమ్మవారి సన్నిధిలో పంజా విజయ్‌కుమార్

నిజాంపేట(మెదక్): మండల పరిధిలోని నందగోకుల్ గ్రామంలోని పెద్దమ్మపెద్దిరాజుల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. రెండో వార్షికోత్సవంతో భాగంగా శుక్రవారం ముదిరాజ్ కులస్తుల ఆధ్వర్యంలో కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా జెడ్పీటీసీ పంజా విజయ్ కుమార్ హాజరయ్యారు. ఆయన రూ.10,500 విరాళంగా ఇచ్చారు. కల్యాణ మహోత్సవం అనంతరం అమ్మవారికి ఒడి బియ్యం సమర్పించి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మల్లయ్య, బాలయ్య, నర్సయ్య, అంజయ్య తదతరులు పాల్గొన్నారు.

వీల్‌చైర్ అందజేసిన సోనుసూద్ ఫౌండేషన్



వీల్‌చైర్ అందజేసిన శివ

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని వెంకట్రావుపల్లి గ్రామంలో దివ్యాంగుడైన యేసుకు సోనుసూద్ ఫౌండేషన్ సహకారంతో సానీక్ష ఫౌండేషన్ శివ వీల్‌చైర్ అందజేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ నడవలేని స్థితిలో ఉన్న యేసుకు సోనుసూద్ సహకారంతో వీల్‌చైర్, నిత్యావసర సరుకులు అందజేశామని చెప్పారు. కార్యక్రమంలో సానీక్ష ఫౌండేషన్ సెక్రటరీ మహేశ్, భాను తదితరులు పాల్గొన్నారు.

వడగాల్పులతో అప్రమత్తత అవసరం



ధాన్యం తూకం పరశీలిస్తున్న ఏఓ స్వప్న

కౌడిపల్లి(నర్సాపూర్): వాతావరణంలో మార్పుల వల్ల రెండు రోజులపాటు వడగాల్పులు వీచే అవకాశం ఉందని, రైతులు జాగ్రత్తగా ఉండాలని ఏఓ స్వప్న సూచించారు. శుక్రవారం కౌడిపల్లి మండలం నాగ్సాన్‌పల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. తూకంతోపాటు తేమశాతం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొనుగోలు కేంద్రంలో వరిధాన్యం అమ్మే రైతులు పట్టాదారు పాస్‌బుక్, బ్యాంక్ అకౌంట్, ఆధార్‌కార్డు జిరాక్స్ పత్రాలను నిర్వాహకులకు అందజేస్తే సకాలంలో డబ్బులు అందుతాయని చెప్పారు. రైతులు ఎండలో పనులు చేయవద్దని సూచించారు. ఏఈఓ రాజశేఖర్‌గౌడ్, భిక్షపతి రైతులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహాలు లభ్యం

హవేళిఘణాపూర్(మెదక్): మండల పరిధిలోని కొంటూర్ చెరువులో ఓ మహిళ మృతదేహం లభ్యమైనట్టు రూరల్ సీఐ కేశవులు తెలిపారు. ఆమె రెండు రోజుల క్రితం చెరువులో పడి ఉంటుందని భావిస్తున్నట్టు చెప్పారు. ఆచూకీ తెలిసినవారు తమకు సమాచారం అందించాలని కోరారు. మృతదేహాన్ని మెదక్ ఆస్పత్రి మార్చురీలో ఉంచినట్లు సీఐ తెలిపారు.

కాళ్లకల్ శివారులో..

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కాళ్లకల్ గ్రామ శివారులోని ప్రసాద్ హోమ్స్ వెంచర్‌లో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైందని ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపారు. సుమారు 35-40 సంవత్సరాల వయస్సు ఉంటుందని, అనారోగ్యంతో చనిపోయాడా, బిచ్చగాడా అనే విషయంపై దర్యాప్తు చేస్తున్నామని ఆయన చెప్పారు.

నిరుద్యోగుల కోసం పోరాటం



మాట్లాడుతున్న రమేశ్

మెదక్ కలెక్టరేట్: నిరుద్యోగులు, రైతుల కోసం పోరాడేందుకే ఎంపీ స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్నట్లు వూట్ల రమేశ్ తెలిపారు. శుక్రవారం ఆయన కలెక్టరేట్ వద్ద మాట్లాడుతూ పార్లమెంట్‌లో జిల్లా రైతుల వాణిని వినిపిస్తానన్నారు. మనోహరాబాద్ మండలం కాళ్లకల్‌కు చెందిన తనను యువత, రైతులు ఆదరించాలని కోరారు.

మహిళల సమస్యలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కళావతి

రామాయంపేట(మెదక్): మహిళలపై జరుగుతున్న వేధింపుల గురించి సఖి ప్రతినిధులు ఉపాధి కూలీలకు అవగాహన కల్పించారు. శుక్రవారం కాట్రియాల, పర్వతాపూర్ గ్రామాల్లో ఉపాధి పనులు చేస్తున్న మహిళలతో మాట్లాడారు. ఎవరైనా మహిళలను వేధిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని సఖీ కేంద్రం ప్రతినిధి కళావతి హెచ్చరించారు. బాధితులను అన్ని విధాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. మహిళలపై దాడులు, అత్యాచారాలు చోటు చేసుకుంటే రెస్క్యూ వాహనంలో వచ్చి బాధితులను ఆదుకుంటామని చెప్పారు. టోల్‌ఫ్రీ నెంబర్లు 181, 112, 1098, 1930కు ఫిర్యాదు చేసే విధానం గురించి వివరించారు. కార్యక్రమంలో పారామెడికల్ సిబ్బంది మంజుల, కార్యదర్శి ధనలక్ష్మి, కూలీలు పాల్గొన్నారు.

వేసవి సమస్యలపై దృష్టి సారించాలి

ఎంపీపీ శ్రీనివాస్



మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీనివాస్

చేగుంట(తూప్రాన్): వేసవిలో ప్రజలు ఎదుర్కొనే సమస్యలపై దృష్టి సారించాలని పలువురు ఎంపీటీసీలు అధికారులను కోరారు. శుక్రవారం ఎంపీపీ మాసుల శ్రీనివాస్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వడదెబ్బ నివారణ కోసం వైద్య సిబ్బంది, నీటి సమస్యల నివారణ కోసం ఆర్‌డబ్ల్యూస్ అధికారులు నిత్యం పర్యవేక్షణతో ప్రజలకు అందుబాటులో ఉండాలని ఎంపీటీసీలు కోరారు. ఉపాధిహామీ కూలీలలో కొన్ని పేర్లు తొలిగించారని వాటిని తిరిగి నమోదు చేయాలని ఎంపీటీసీ హోలియా కోరారు. అనంతరం ఎంపీపీ మాట్లాడుతూ వేసవి సమస్యలపైనే అధికారులు దృష్టి పెట్టాలని సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీఓ చిన్నారెడ్డి, పలుశాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యతోనే ఉన్నత ఉద్యోగాలు



మాట్లాడుతున్న రవిచంద్ర

నర్సాపూర్: ఉత్తమ విద్యతోనే రికార్డుస్థాయిలో విద్యార్థులు ఉద్యోగాలు పొందుతున్నారని విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ వైస్ చైర్మన్ రవిచంద్ర రాజగోపాల్ చెప్పారు. స్థానిక బీవీరాజు ఇంజనీరింగ్ కాలేజీ 27వ వార్షిక వేడుకల్లో భాగంగా శుక్రవారం కాలేజీ ఆవరణలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలేజీ విద్యార్థులు చేసిన ప్రధాన ప్రాజెక్టులతో జాతీయ స్థాయి అవార్డుల ద్వారా తమకు ప్రత్యేక గుర్తింపు వచ్చిందన్నారు. ప్రముఖ గాయకుడు శ్రీరామచంద్ర పాడిన పాటలు అందరినీ అలరించాయి. కాలేజీ డైరెక్టర్ లక్ష్మీప్రసాద్, ప్రిన్సిపాల్ సంజయ్‌దూబె, డీజీఎం కాంతారావు, మేనేజర్ బాపిరాజు, ఏఓలు అశోక్‌రెడ్డి, సురేశ్ పాల్గొన్నారు.

ఆధునిక సాగుతో ఆదా ..

ఏడీఏ సంధ్యారాణి



రైతులకు వివరిస్తున్న అధికారులు

శివ్వంపేట(నర్సాపూర్): రైతులు ఆధునిక సాగు విధానాలను అలవర్చుకోవాలని వ్యవసాయ సంచాలకురాలు సంధ్యారాణి పిలుపునిచ్చారు. మండల పరిధి దొంతి గ్రామంలో కృషి విజ్ఞాన్ గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో రైతులకు ఆధునిక సాగువిధానం గురించి శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో వెదజల్లే పద్ధతిలో సాగైన వరిపొలాలను పరిశీలించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ వెదజల్లే పద్ధతిలో సాగుచేయడం ద్వారా ఎకరాకు రూ.8వేలు ఆదా చేయవచ్చన్నారు. కృషి విజ్ఞాన్ గ్రామీణాభివృద్ధి సంస్థ చైర్మన్ లక్ష్మీ కాంతారావు మాట్లాడుతూ రైతులు రసాయన ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ సాగు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా రైతు సమన్వయ సమితి గౌరవ అధ్యక్షుడు మైసయ్యయాదవ్, ఏఓ లావణ్య, ఏఈఓ మాజిద్ అలీ, పలు గ్రామాల రైతులు ఉన్నారు.

ఘనంగా కాళీమాత విగ్రహ ప్రతిష్ఠ



వెల్దుర్తి(తూప్రాన్): విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్న భక్తులు

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని ఎం.జలాల్‌పూర్ గ్రామ శివారులో 14అడుగుల మహాకాళీమాత విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకుడు సత్యనారాయణ అన్నదానం చేశారు.

కట్టమైసమ్మకు ప్రత్యేక పూజలు...

పెద్దశంకరంపేట(మెదక్): మల్కాపూర్‌లో కట్టమైసమ్మ ఆలయ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. శుక్రవారం ఆలయ ఆవరణలో ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

ఆగిన వివాహం..

- మరో అమ్మాయితో సంబంధం
- నిలదీసిన పెద్దలు, కుటుంబ సభ్యులు

శివ్వంపేట(నర్సాపూర్): వరుడు మరో అమ్మాయిని ప్రేమించి, పెళ్లికూడా చేసుకున్న విషయం వెల్లడవడంతో పెళ్లి ఆగిపోయిన ఘటన వెలుగులోకి వచ్చింది. మండల పరిధి శభాస్‌పల్లి గ్రామానికి చెందిన రమేశ్ స్థానికంగా ఉన్న ఓ ఫార్మా పరిశ్రమలో పనిచేస్తున్నాడు. అదే పరిశ్రమలో పనిచేస్తున్న ఓ మహిళను ప్రేమించి తన కుటుంబ సభ్యులకు తెలియకుండా ఆమెను పెళ్లికూడా చేసుకున్నాడు. ఈ క్రమంలో మెదక్ ప్రాంతానికి చెందిన మరో అమ్మాయితో మళ్లీ పెళ్లికి సిద్ధమయ్యాడు. అది శుక్రవారం పెళ్లి జరగాల్సిఉంది. అయితే రమేశ్ పెళ్లి చేసుకున్న ఆ మహిళ తనతో జరిపిన ప్రేమ, పెళ్లి వ్యవహారం గురించి వధువు కుటుంబ సభ్యులకు వివరించింది. దీంతో వారు గురువారం శభాస్‌పల్లికి చేరుకొని రమేశ్ కుటుంబ సభ్యులను నిలదీశారు. విషయం తెలియడంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. గ్రామ పెద్దలు, బంధువులు కల్పించుకుని శుక్రవారం జరగాల్సిన పెళ్లిని రద్దుచేశారు. రమేశ్ కుటుంబ సభ్యులకు జరిమానా కూడా విధించినట్లు తెలిసింది. అయితే తనను రమేశ్ ప్రేమించి పెళ్లి చేసుకుని మోసం చేశాడని బాధిత యువతి ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఈ వ్యవహారం సోషల్ మీడియాలో వైరల్ అయింది.

అంగన్‌వాడీలో నాడు.. నేడు

- నేడు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ 44వ వార్షికోత్సవం
- మొట్టమొదటి సారిగా నిర్వహిస్తున్న సీడీపీఓ



లింగోజిగూడ అంగన్‌వాడీ కేంద్రంలో విద్యాబోధన చేస్తున్న టీచర్

కౌడిపల్లి(నర్సాపూర్): అంగన్‌వాడీ కేంద్రాలు ఆవిర్భవించిన నాటి నుంచి ఇప్పటి వరకు అందుతున్న సేవల గురించి తెలియచేసేందుకు 'నాడు.. నేడు' పేరుతో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ 44వ వార్షికోత్సవం శుక్రవారం నిర్వహిస్తున్నామని సీడీపీఓ హేమ భార్గవి తెలిపారు.

ఉమ్మడి జిల్లాలో..

నర్సాపూర్ నిజయోజకవర్గంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్‌ను 1980లో ఏర్పాటు చేశారు. అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటుచేసి 100మంది కార్యకర్తలను నియమించారు. ఆ కార్యకర్తలు పిల్లలకు పౌష్టికాహారం అందజేయడం, పాలపొడి, మురుకులు పంపిణీ చేసేవారు. సోయా ఉప్మ, హాట్ కిచిడి, స్వీట్ కిచిడీ అందించేవారు. పిల్లలకు విద్యబోధన చేసేవారు.

పూర్వ ప్రాథమిక విద్య..

44ఏళ్లలో అంగన్‌వాడీలలో విశేషమైన మార్పులు వచ్చాయి. ప్రస్తుతం అంగన్‌వాడీ కేంద్రాలో పిల్లలు పూర్వప్రాథమిక విద్యాబోధన జరుగుతోంది. ఆట పాటలతో పిల్లలకు బోధిస్తున్నారు. ఆట వస్తువులతోపాటు నృత్యాలను చేసేందుకు ప్రీస్కూల్ మెటీరియల్ అందుబాటులో ఉంది.

ఆరోగ్యలక్ష్మితో భోజనం..

అంగన్‌వాడీ కేంద్రాలలో ప్రస్తుతం గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పౌష్టికాహారం పంపిణీలో భాగంగా ఒక్కపూట పూర్తిస్థాయి భోజనం అందిస్తున్నారు. దీంతోపాటు పాలు, కోడిగుడ్లు ఇస్తున్నారు.

కిచన్ గార్డెన్‌లు, ఆన్‌లైన్ సేవలు..

నేడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. గర్భిణులు, బాలింతలు, పిల్లలకు పంపిణీచేసే ఆరోగ్యలక్ష్మి, కోడిగుడ్లు, పాల పంపిణీతోపాటు కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేస్తున్నారు. కేంద్రాల వద్ద కిచెన్ గార్డెన్‌లు ఏర్పాటు చేస్తున్నారు.

42 ఏళ్లుగా విధులు



1982లో అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయగా మొదటి నుంచి విధులు నిర్వహిస్తున్నా. ఇప్పటికి 42ఏళ్లుగా గడిచాయి. మొదట్లో రూ.50 గౌరవ వేతనం ఇచ్చేవారు. మొదట్లో పిల్లలకు పాలపొడి, మురుకులు ఇచ్చేది. ప్రస్తుతం వేతనం పెరిగింది. పని భారం సైతం పెరిగింది.

– ఫరీజ్, అంగన్‌వాడీ టీచర్ కౌడిపల్లి

ప్రజలకు తెలిపేందుకే 'నాడు.. నేడు..'



మొదట్లో అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రజలకు అందిన సేవలు, నేడు అందుతున్న సేవల గురించి ప్రజలకు తెలియచేసేందుకే వార్షికోత్సవం నిర్వహిస్తున్నాం. ఇప్పుడు చాలా కార్యక్రమాలు చేస్తున్నాం. మోడల్ అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేశాం. కిచెన్‌గార్డెన్లు పెంచుతున్నాం. పూర్వప్రాథమిక విద్యాబోధన, ఆన్‌లైన్ సేవలు కూడా అందిస్తున్నాం.

– హేమభార్గవి, సీడీపీఓ.

సంక్షిప్త వార్తలు

◆ ఓటుపై అవగాహన కార్యక్రమం



మెదక్ మున్సిపాలిటీ: ఆర్టీసీ బస్టాండ్‌లో ఓటుపై కళాకారులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. స్వీప్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో కళాకారులు పాటలు పాడి ఓటు విలువైనదని పాటల ద్వారా చైతన్యం కల్పించారు.

◆ జయప్రదం చేయాలి

చిలప్‌చెడ్(నర్సాపూర్): బీజేపీ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావు చేయనున్న రోడ్ షో, కార్నర్ సమావేశాలను జయప్రదం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి గోడ రాజేందర్ పిలుపునిచ్చారు. శుక్రవారం జరిగిన ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌గౌడ్, జిల్లా ఎస్టీ మోర్చ ఉపాధ్యక్షుడు కిషన్ నాయక్, సత్యనారాయణ, నాగేశ్‌యాదవ్ దితరులు పాల్గొన్నారు.

◆ ఆలయ నిర్మాణానికి భూమిపూజ

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని గౌతాపూర్‌లో హనుమాన్ ఆలయ పునఃనిర్మాణానికి శుక్రవారం భూమిపూజ చేశారు. గ్రామ పెద్దలు మాట్లాడుతూ మాధవానంద సరస్వతి సూచనల మేరకు పాత ఆలయాన్ని తొలగించి, పునఃనిర్మాణానికి భూమిపూజ చేశామన్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు విఠల్, అంజిరెడ్డి, వెంకయ్య, వీరయ్య, శివగౌడ్, యాదయ్య పాల్గొన్నారు.

సేవాలాల్ ఆలయానికి...

కౌడిపల్లి(నర్సాపూర్): కౌడిపల్లిలో జగదాంబదేవి, సంత్ సేవాలాల్ మహరాజ్ ఆలయ నిర్మాణానికి శుక్రవారం గిరిజనులు భూమిపూజ చేశారు. అర్చకులు కొలాచల రాజేశ్వరశర్మ, గిరిజన పూజారి పూల్‌సింగ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ నిర్మాణానికి అందరూ సహకరించాలని కోరారు. కొర్ర శ్రీనివాస్, ఇట్యానాయక్, జవహర్, పద్యానాయక్, లక్ష్మణ్, దేవిసింగ్ పాల్గొన్నారు.

◆ 29న దుకాణాల వేలం

హుస్నాబాద్: ఎల్లమ్మ జాతర పురస్కరించుకొని ఈనెల 29వ తేదీన దుకాణాల ఏర్పాటుకు హుస్నాబాద్‌లో బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వాహణ అధికారి శుక్రవారం తెలిపారు. ఆలయ ఆవరణలో టెంకాయలు, పూజా సామగ్రి, లడ్డూ పులిహోర తదితర దుకాణాలు ఏర్పాటుకు వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే పందిళ్లు, క్యూ లైన్లు, ఎలక్ట్రికల్ డెకరేషన్, కేటరింగ్, దేవాలయ ప్రాంగణం శుభ్రం చేయడానికీ వేలం నిర్వహిస్తామన్నారు.

◆ హ్యాండ్ బాల్ శిక్షణ శిబిరం

మద్దూరు(హుస్నాబాద్): మద్దూరు మండల కేంద్రంలో మే 1 నుంచి 31 వరకు సిద్దిపేట జిల్లా స్పోర్ట్స్ అథారిటీ, జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత హ్యాండ్‌బాల్ శిక్షణ ఇస్తున్నట్లు మద్దూరు మండల హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు మనోహర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 15 ఏళ్లలోపు బాలబాలికలు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

◆ ఆత్మగౌరవ పత్రిక పుస్తకావిష్కరణ

సిద్దిపేటజోన్: సమ్మక్క సారలమ్మ జాతర విశిష్టతపై బండి ఉష రాసిన ఆత్మ గౌరవ పత్రిక పుస్తకాన్ని శుక్రవారం కవులు ఆవిష్కరించారు. సిద్దిపేటకు చెందిన 15 మంది కవుల కవితలు ఉన్నాయని వక్తలు పేర్కొన్నారు.

◆ బస్సు సర్వీస్‌లు పునరుద్ధరించాలి

హుస్నాబాద్: హుస్నాబాద్ నుంచి హైదరాబాద్‌కు బస్సు సర్వీస్‌లను పునరుద్ధరించి, డిపోకు కొత్త బస్సులు కేటాయించాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు గడిపె మల్లేశ్ శుక్రవారం డిమాండ్ చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రాతినిథ్యం వహిస్తున్న హుస్నాబాద్ నియోజకవర్గ కేంద్రంలోని బస్ డిపో అధికారుల నిర్లక్ష్యంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. హుస్నాబాద్ నుంచి హైదరాబాద్‌కు ప్రతీరోజు ఉదయం 5 గంటలకు నడిచే సూపర్ లగ్జరీ బస్ సర్వీస్‌ను ఆర్టీసీ అధికారులు రద్దు చేయడంతో ప్రయాణికులు నానా అవస్థలుపడుతున్నారని తెలిపారు.

◆ అక్రమంగా మద్యం విక్రయిస్తే చర్యలు

గజ్వేల్‌రూరల్: ప్రభుత్వ అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని గజ్వేల్ పోలీసులు హెచ్చరించారు. మండల పరిధిలోని ఆరెపల్లి(ఎస్‌బీ)లో మహ్మద్ మతిన్ తన కిరాణా దుకాణంలో ప్రభుత్వ అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తున్నాడనే విశ్వసనీయ సమాచారం మేరకు గురువారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. 40.400 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.